శరధార

2699/ROP

ACC NO. 14331

ఊటుకూరు రంగారావు

ప్రచురణ:

భారత సాహిత్య కళా పరిషత్

మోహన్ రోడ్ — ఖమ్మం.

ప రి చ య ం

ఉత్సాహం అందుకుతగిన నిర్మాణాత్మకశక్తి కలిగి, కార్యసాధనకు కావలసిన సాధనసంపత్తిని ఒనగూర్చుకొని, జనాంతికంలో కానొక విశిష్టవ్యక్తిగా, కలహోదారుడుగా ఉంటూ నిస్వార్థమైన సాహిత్యసేవ జరుపుతూ 33 సంవత్సరాల స్వల్పకాలికవ్యవధిలోనే శ్రీ ఊటుకూరు రంగారావు అస్తమించడం ఖమ్మంజిల్లా సారస్వతోద్యమానికి తీరని ఆఘాతం. ఖమ్మంజిల్లావాసులు ముఖ్యంగా యువతరం అందరిలో ఆకర్షవ్యక్తిగా, అనుంగు సోదరుడుగా స్థిరనివాసం కల్పించుకోవడం, ఈ స్వల్ప జీవితకాలంలోనే ఈ యువ సాహితీ తేజఃకళిక జిల్లా సారస్వత నందనోద్యానవనంలో దిగంత పరిమళ సంభారవాయువుల్ని పరచి. సహృదయ హృదయాహ్లాదకరంగా ప్రవర్తిల్లడం, అదంతా ఒక మధుర స్వప్నఘట్టంగా భాసిల్లుతున్నది.

ఖమ్మంజిల్లా మధిర తాలూకా నారాయణపురం అనే కుగ్రామంలో శ్రీ ఊటుకూరు 1929 వ సంవత్సరంలో జన్మించారు. ఉన్నతసంస్కారపూరితమైన అతి సాధారణవిద్వత్కుటుంబంలో వీరు జన్మించారు. వీరి తండ్రిగారు, జనయిత్రి

సోదరీసోదరులు అందరూ కవితాభిమానులే కాక కవిత్వం కూడా చెప్పగలిగినవారు. ఈ సంస్కారబలమే శ్రీ రంగారావుగారిలో అందరికంటే విశిష్టంగా విద్యోతించి, ప్రాచీనాధునికరీతిరమ్యతలతో నవ్య కవితాకుమారి ఈతనిని వరించింది. పరిపక్వ గంభీరమైన భాషామార్దవం, చివురాకు మెత్తనైన శబ్దపల్లవాల సొగసు, సుమధుర పరిమళసంభరితమైన విషయజ్ఞానగరిమ ఈతని శైలి రసహృదయులను అమితంగా ఆకర్షించింది... అలరించింది. తత్ఫలితంగా అనేక పద్యఖండికలను, గేయాలను రచించారు.

శ్రీ రంగారావుగారు ఇరవై సంవత్సరాలు నిండకముందే తెలంగాణావిమోచనోద్యమం విప్లవధ్వజమెత్తింది. అనేక మంది జాతీయప్రేమికులైన యువకులు ఆనాటి నిజాం నిరంకుశ అంధపాలనకు వ్యతిరేకంగా కాశగట్టి సమరోన్ముఖులైనారు. మిల్లుకూలీలు, రైతులు, కార్మికులు ఒకరేం ? అనేకులు, అనేకరంగాలలో పనిచేసేవారు విప్లవం రేకెత్తించారు. యువకవులు తమ శక్తివంతమైన కవితారచనద్వారా గ్రామ పల్లెల్లో చైతన్యవెల్లువను ఉప్పొంగించారు. తెలంగాణా ప్రాంతంలోని ముఖ్యంగా ఖమ్మంజిల్లానుండి కవులు, రచయితలు ఈ ఉద్యమానికి మరింత బలాన్ని చేకూర్చారు. అప్పటి యువకవులలో శ్రీయుతులు దాశరథి, హీరాలాల్ మోరియా, ఊటుకూరు రంగారావు, తాళ్ళూరి రామానుజస్వామి, చందాల రామకవి మొదలైనవారున్నారు.

కుటుంబ బాధ్యతలమూలంగా అప్పటికే విద్యకు స్వస్తి చెప్పి జీవికను నిర్వహిస్తున్న రంగారావు స్వాతంత్ర్యోద్యమంలో ధైర్యోపేతంగా అడుగు పెట్టాడు.

రజాకార్ అమానుష దురంతకృత్యాలకు గురియై హతాశులైన జనసందోహాన్ని వెన్నుతట్టి, ఆ దుర్మార్గాలను అంతమొందించడానికి శ్రీ ఊటుకూరు వందలాది గేయాలను రచించి ప్రజలను ఉద్వేగపూరితుల్ని చేశాడు.

"తప్పదు...
పల్లెటూళ్ళ హృదయాల్లోని
ప్రళయాగ్ని వర్షిస్తుంది
మానవహరణోద్యోగంలోంచి
మంటలు ప్రభవిస్తవి.
ఎగిరిపోతై ఇనప తెరలు...
మారిపోతై సాంఘికధర్మాలు
శ్మశానాల్లో సగంకాలిన యుగశవాలకి
ప్రాణప్రతిష్ఠ జరుగుతుంది"

అని హెచ్చరించి అణగారిపోయిన ప్రజాహృదయాలలోని విప్లవార్చిస్సులను పెచ్చరిల్లచేశాడు. దురంతాలకు ఆహుతై యశఃకాయులైన అనేకమంది అమాయికసోదరులనుగురించి కన్నీరుకారుస్తూ మానవత్వంకోసం మంచికోసం, మనుగడ కోసం ప్రాణాలర్పించిన జాతీయవీరులకు శ్రద్ధాంజలిఘటిస్తూ—

"ఎందుకోసం చచ్చారో

అందుకోసమే బ్రతకాలిమళ్ళీ"

అని మానవత్వంమీద, మనుగడమీద ఆశాసుమాల్ని చల్లి సమాశ్వాసిస్తాడు.

వర్గవిభేదాలతో జాతిని చిక్కులకుగురిచేసి ఒకళ్ళొకళ్ళ ఉనికిని ద్వేషిస్తూ, హక్కుల్ని దోచుకునేపద్ధతికి దిగజారిపోగా ఏర్పడిన రాజకీయ విషవలయాన్ని చూచి శ్రీ రంగారావు హృదయం తీవ్రసంక్షోభం చెందింది. దీన్ని తీవ్రంగా నిరసిస్తూ తన వజ్రకంఠంతో పెనుగర్జనసలిపి సంఘవ్యతిరేకశక్తులకు హడలుపుట్టిస్తాడు.

"సమతావాదం నాది,
సహజసంపదలు నావి,
హక్కుల మ్రింగేవాళ్ళని
ముక్కలుకొట్టేస్తాను.
నా కవితా విలయాగ్నిలో
భస్మం చేసేస్తాను...."

మరొకచోట

"బ్రతుకలేక వెర్రెత్తిన
అతిబాధాపీడితులు
ఎండవానలకి సమముగ
వొళ్ళొంచే రైతుజనులు
బ్రతుకును నరకంగా భావించే శ్రమికజనులూ,
నిరాశ్రయులు, నిరుపేదలూ

నిర్జీవులుసైతం నా కవిత్వాన్ని వింటాయి.
నా కవితా సుధాధారల్తో
ఈ దరిద్రప్రపంచాన్ని
స్వర్గంగా మార్చేస్తా.
నాకెవ్వరిభయం లేదు...
నాకొకరిదయ పనికిరాదు
తప్పకపాడేస్తానొక
నిప్పుల తుపానుగీతం..."

అని తన కవిత్వాన్ని దీనమానవశ్రమాపనయనంగా అభివర్ణించి, స్వేచ్ఛావిప్లవఝంఝానిలగీతాన్ని పాడతాడు.

కవిత్వంపైగానీ, వ్యక్తిత్వంపైగానీ ఏ ఇతర ప్రభావం పడటం శ్రీ రంగారావు యెంతమాత్రం సహించేవాడుకాడు. జాతీయాభిమానం, ఉన్నత ఆదర్శం రెండూ హెచ్చుగాగల సాహితీపరుడాతడు. వివిధ దేశాల సంస్కృతీ, ఆచారాలు, సామాజిక జీవనవైఖరి నిశితంగాపరిశీలిస్తూ అన్నింటికీమించిన మన భారతీయసంస్కృతీ ఔన్నత్యాన్ని, అందులోని విశిష్టతనూ శ్రీ ఊటుకూరు అమితంగా ప్రేమించేవాడు. జీవితంలోని ఉన్నతాదర్శ శిఖరాలనుండి, ఎన్నడూ ఎట్టి సంక్లిష్ట పరిస్థితిలోనూ ఆతడు దిగజారలేదు... ఆధిక్యంసహించలేడు. ఆత్మాభిమానానికీ, వ్యక్తిత్వానికీ భంగంకలిగించే ఏ చర్యనూ అతను జరుపలేడు... జరుగుతూండగా చూసి మిన్నకుండలేడు

"పరకాయప్రవేశవిద్య నేర్చిన మానవుడు
పిశాచాల శరీరాల్లో
ప్రవేశించి, నర్తిస్తూ
భూనభోంతరాళాలు విరిగి చెక్కలయ్యేట్టు
వికృతంగా నవ్వి
మానవత్వాన్ని ఖూనీ చేసి
శ్మశానానికీడుస్తున్నాడు."

అని మానవులలోని కృత్రిమత్వాన్ని, అసహజత్వాన్ని అసహ్యించుకున్నాడు.

అణుశక్తి నిర్మాణోద్యమంలో అహరహమూ పోటీలు పడి భయంకర యుద్ధవాతావరణాన్ని సృష్టించే పెద్ద దేశాలను దుయ్యబడుతూ అవి ప్రేరేపిస్తూన్న యుద్ధజ్వాలలను గురించి, అందువల్ల కలిగే భయంకర విషపరిణామాలను ఈవిధంగా వర్ణించారు.

"యుద్ధం...!
కమ్ముకొంది దశదిశల
గంభీరయుద్ధజ్వాల
దిక్కుదెస తోచక
కుక్కచావు చచ్చే నరులు
కడుపుకోత తాళలేక
నడివీధిన నిలచిన మనుషులు..."

మానవుడు, మానవుడుగా మసలిగే మంచి ఘడియలకోసం శ్రీ రంగారావు ఎంతో తహతహపడేవాడు. మతం, వర్ణం, ఇవన్నీ మానవుణ్ణి, మానవుణ్ణే దూరంచేసే పద్ధతికి దిగజారినవనీ, సమాజైక్యతావిచ్ఛిత్తికి ఇవి నిలయాలైనవనీ ఈ విభేదాలునశించే విప్లవాత్మకమైన మార్పు అత్యావసరమనీ ఆయన అనేవాడు. కష్టదశఅనేది ఎవరికి ఏ రూపంలోవచ్చినా, పర్యవసానం ఒకటిగానేవుంటుందనీ, అల్లాంటివారికి తోటివారు చిత్తశుద్ధితో, ప్రతిఫలాపేక్ష లేకుండా సహకరించడం సముచితమైన మానవతాధర్మం అని అనేవాడు. ఈర్ష్యాసూయలులేని మనస్సుల్లోనే నిస్వార్థమైన సేవాభావం అంకురిస్తుందనీ, అట్టి వ్యక్తియే సమాజౌన్నత్యానికి ఉజ్జీవనత కల్పించగలడనీ ఆయన ప్రగాఢవిశ్వాసం. శ్రీ రంగారావు తన జీవితకాలంలో ఈ విశ్వాసానికి అంకితమైపోయాడు అందరి మంచితనానికీ, మన్ననకీ పాత్రుడైనాడు. ఆయన స్నేహావరణంలో అందరూ పరిమళసంభరితమైన కుసుమరాజాలే.

1949 నుంచి 58 వ సం॥ వరకు శ్రీ రంగారావు అవిరళంగా రచనలు కొనసాగించాడు. అప్పటినుండే రచనలతో పాటు పత్రికారచనకూడా ప్రారంభించి, జిల్లాలోని అనేక సాంఘిక, రాజకీయ, వైజ్ఞానిక సంబంధకార్యక్రమాలకు ఎనలేని ప్రచారాత్మకసేవాకృషిని అందించాడు. 56 నుండి ఖమ్మంజిల్లా హిందీ ప్రేమీమండలి కార్యదర్శిగా, జిల్లా రచయితలసంఘ కార్యదర్శిగా అంతకుపూర్వం తెలంగాణా

రచయితలసంఘం ఖమ్మంశాఖకు కార్యదర్శిగా పదవీ బాధ్యతలను నిర్వహించాడు. సుమారు 6 సంవత్సరాలపాటు ఖమ్మం పట్టణ విజ్ఞాననికేతన గ్రంథాలయ లైబ్రిరియన్‌గా ప్రశంసార్హమైన సేవ చేశాడు. పద్యం ఎంత చక్కగా వ్రాసేవాడో వచనం అంత ప్రవాహసదృశంగా వ్రాసేవాడు. ఆతని చేవ్రాలు ముత్యాలసరంవలె ఎంతో ముచ్చటగొల్పుతుంది

ఖమ్మంజిల్లా అభ్యుదయసాహిత్యవరులలో మకుటస్థానీయుడైన శ్రీ ఊటుకూరు రంగారావు గత మార్చి 11 వ తేదీన వైరాగ్రామంలో గుండెపోటుకు గురై హఠాత్తుగా అస్తమించారు. ఈ దారుణ సంఘటనకు జిల్లాలో ప్రతి యువ హృదయం బెగ్గడిల్లింది. అందరి మంచితనంలో సదాశయంలో మెలగే అత్యంత ప్రియమిత్రం అస్తమించడంవల్ల కలిగిన లోపం తీర్చరానిది. నిరుపేద కుటుంబజీవనం గడుపుతూ ముక్కుపచ్చలారని పసిపాపనూ, భార్యను, సోదర సోదరీమణులను అందరినీ వీడి ఈ యువసాహితీ తేజఃకళిక మలగిపోయింది.

శ్రీ రంగారావు తెలుగు, ఉర్దూ ఈ రెండుభాషల్లో సముచితమైన పాండిత్యప్రకర్ష కలవాడు. ఉర్దూభాషనుండి అనేక కథలు కవితలు అనువదించి ఉర్దూభాషకుకూడా ఎనలేని సేవ చేశారు.

ఈ "శ ర ధా ర" కవితాసంకలనం నిఖిలాంధ్ర సోదరుల ఆదరణపాత్రమౌతుందని విశ్వసిస్తున్నాను.

ఖమ్మం
ది 15-8-1963 }

కొలిపాక మధుసూదనరావు
కార్యదర్శి: జిల్లా రచయితల సంఘం

ఒ క మా ట

ఒకసందర్భంలో ఉర్దూ మహాకవి "జోష్" సహృదయుడు కాని వాడు నాదృష్టిలో కవికాడు. ఒక గొప్పవ్యక్తి ఈ ప్రపంచంలో ఏదైనా కావచ్చు— కాని కవి కాలేడు —. అని అన్నాడు.

శ్రీ ఊటుకూరు రంగారావులో వున్న గొప్పతనమల్లా అతడు సహృదయుడు కావడమే. ఏ దృష్టితో చూచినా అతడొక గొప్పవ్యక్తి. శ్రీరంగారావు కవిత్వంలో అసహజత్వం ఏమీ వుండదు. అతని కవిత్వం, కథలు, మాటలధోరణి అన్నీ జీవితంలో వాస్తవపరిస్థితులను ప్రతిబింబంగా వుంటవి బాల్యం నుంచే అతను జీవితపు ఒడుదుడుకుల్ని ఎంతో ధైర్య సాహసాలతో ఎదుర్కొంటూ ముందుకు సాగిపోయాడు. జీవితంలో అనేక కష్టాలకు గురికావలసివచ్చినా, అతను ధైర్యాన్ని కోల్పోకుండా ముందుకు వెళ్ళేడే కాని, నిస్పృహ ఎన్నడు చెందిఎరగడు.

శ్రీ రంగారావు స్వల్ప వయఃపరిమితిలోనే అకస్మాత్తుగా తనువు చాలించడం భాషాభిమానులకు, మిత్రులకు, విద్యాదాఘాతమైపోయింది. అయినా ఆయన రచనల్లో శాశ్వత స్థానాన్ని భద్రపరచుకున్నాడు.

భారతసాహిత్యకళాపరిషత్ పక్షాన ప్రస్తుతం "శరధార" అను ఈ ఖండకావ్య సంపుటిని ఆంధ్రసోదరులకు అందించుచున్నాము. ఈప్రచురణలో సహాయపడిన మిత్రులు శ్రీయుతులు బి.పర్వతాలరావు, సి. హెచ్. వెంకట్రామయ్య, వి. మధుసూదనరావు, పుల్లాభొట్ల, మాదిరాజురంగారావు రావు పాటి సత్యనారాయణరావు, వ్రాంటూరు రంగారావు బి.ఎ.బి.ఇడి. జె. సూర్యనారాయణగార్లకు హృదయపూర్వక కృతజ్ఞతలు. ఈ పుస్తకమును ముద్రించి సకాలములో అందించిన శ్రీ కప్పగంతుల భాస్కరరావుగారు ప్రత్యేక అభినందనీయులు. క్రమంగా భాషాభిమానుల ప్రోత్సాహ సహకారములతో వీరిఇతర రచనలనుకూడా అందించడానికి సిద్ధంగా వున్నామని విజ్ఞప్తి చేస్తున్నాము.

ఇట్లు,

హీరాలాల్ మోరియా,

అధ్యక్షులు,

భా సా కళాపరిషత్

డా॥ ఉకూరు రంగారావు

ఇందులో

		పుట
1	సుస్వాగతము	1
2	ప్రభాతగానం	4
3	స్వాతంత్ర్యవందనం	7
4	జీవితాదర్శము	9
5	శరధార	11
6	వెలుగుబాట	13
7	మహోన్నతి	15
8	శ్రీ గిరీశునకు	17
9	ఆలోచన	20
10	ఎవరికి చెంగావా	23
11	ఏమిస్తావో నాకు	25

శుభోదయము

హిమవద్గిరీంద్రాగ్ర రమణీయధావళ్య
కాంతులు విశ్వసంక్రాంతులయ్యె
బహుకోటిజనహృత్ పట్టికలం దరు
ణోదయరక్తిమలుల్లసిల్లె
చీకటికలలలో చెదరిపోయిన పురా
ప్రతిభ యదార్థరూపముధరించె
భిన్నసంస్కృతులు విభిన్నవర్ణముల యం
దనురాగ బంధంబు పెనచుకొనియె

ఒక్కటే ఒక్క గొంతుగా, ఒక్కత్రాటి
పై సమస్తము నిల్చిన భారత ప్ర
భావ సమ్మోహనమున, ప్రపంచగతియె
నియతినందిన దీ శుభోదయపు వేళ.

శుభోదయము

నేటి కెనిమిదేండ్ల నాటిక్రితము గన్ని
నట్టి దీ యశస్సు పట్టణముల
పల్లెపల్లెయందు, ప్రజల గుండియలందు
వెలుగు నింపినట్టి దీయుషస్సు.

ఇది చారిత్రకఘట్టమీ యుదయమొంతే పూజనీయాత్మకం
బిదిహర్షప్రద, మిద్ది మానవమహాదృష్ట ప్రభారేఖ, ప్రా
త దరిద్రంబు నశించిపోయినది, నూత్నారంభముల్ జీవితా
భ్యుదయ ప్రాప్తికి సాగుచున్నవి...సుఖాబ్ధుల్ పొంగిపొర్లె
డిన్.

సర్వమానవ కల్యాణ సామ్యవాద
రూపమున జనరథసమారోహణం బొ
నర్చి, యీ యుషస్సంధ్యాపథాంతరమున
నడచివచ్చె ప్రజాశక్తి నాకడకును.

ఒక్కరి హక్కుకాదిది, మరొక్కరిదియ్యది కాకపోదు, యిం
దెక్కువతక్కువల్ కులమతీర్ష్యలు నిల్చెడి తావులేదు, పెం
పెక్కిన మత్తచిత్తుల బిభీషికలిచ్చట సాగిరావు, మా
ప్రక్కల పంచశీలములుమాత్రమె, నిల్చిచరించుస్వేచ్ఛగన్.

శుభోదయము

నాకు చీకట్లు లేవు చీకాకు లేదు
నాకొక నిరంకుశ ప్రభునాజ్ఞ లేదు
యే నాకరిజాలిపై బ్రతుకీడ్వ లేను
నేను భారతశక్తి జీర్ణించుకొంటి.

ప్రాతన్ రోతయటంచు త్రోసిచన నర్వాచీన సంభావ్యతా
రీతుల్ మంచివి నేర్చుకొందును, అతియుద్రేకంబు పోనాడెదన్
స్వాతంత్ర్యంబును నిల్పుచాత్మయెడ విశ్వాసంబుపోనాడకన్
ఖ్యాతిన్ నే బ్రతుకోర్చుకొంచు బ్రతుకంగాచూచుకొందున్
భువిన్.

సంఘుఃహిరంగ వనలతాశ్రమములందు
వేయి పరిమళసుమముల పూయనిండు
ప్రజల పరిణత మేధోంతరాళమందు
వేయిసిద్ధాంతభాష్యముల్ వెలయనిండు

కోటిగుండెలయందు నిగూఢమైన
రాగవీణలు తీయగా మ్రోగనిండు
సప్తవర్ణాద్భుత ప్రభాచ్ఛటల వెలుగు
ఇంద్రధనువట్లు సంస్కృతి నెగయనిండు
యుద్ధమేఘాలధాటితో దద్దరిల్లు ,
జగతిపై శాంతివర్షమ్ము సాగనిండు!

ప్రభాతగానం

అదె యుషారాణి! పులకించె; నామె హస్త
స్వర్ణకంకణ మంజునిస్వనలు దెసల
ప్రథితమయ్యెను తొలి యుషఃప్రసవరాజి
విరిసె, నిరుపేద గుండెలు వెలుగునట్లు.

అదిగో! బాలార్కుడుదయించె నాతడే యి
కింతసేపాగినన్ ప్రళయంకరుడగు
నట్లు గన్పడు మీమీ యనాథదశల
దాటి, చండాంశుడైన మార్తాండునివలె
విక్రమింపుడు దీనుల వేరుజేసి
కాలరాచు విశ్వమును దగ్ధంబొనర్ప.

నవభానూజ్వల దివ్యకాంతికలితా నల్పాగ్ని విక్రాంతి క
ల్లవిగో కొండలుకొండలేకరిగి నాయాచోటులం దుండి, ది
వ్య విభూత్నంబగు వీణాతీవలవలెన్ స్వర్ణోజ్జ్వలత్కాంతితో
ప్రవహించెన్, దివిప్రాక జొచ్చెనవిగో ప్రాభాతకాంతిస్ఫురత్

తెలతెలవారెరా! ఉదయతేజము దిక్కులప్రాకెరా! ప్రజా
బలమిటు వృద్ధిజెందునని భానుడు తూరుపు కొండనెక్కెరా!
కలకలలాడెరా జగము కాంతిమయంబగుచుండె వేచి, దు
ర్బలులకు రక్షగల్గు నిరపాయ స్థలంబును సృష్టిజేయరా!

గణగణ మ్రోగెగా విజయఘంటలు విప్లవ ఘోషతో ఝం
ఝణమన సాగరా బ్రతుకు చావులమధ్యన నున్న ఘోరజీ
వన బడబానలోజ్జ్వల ప్రభాయుతకాంతులు మిన్నుముట్టె ని
ర్ధన వ్యతిరేక సంఘమును దగ్ధమొనర్పగజూచె లేవరా!

ఉద్వేగల మానవత్వము నూడ్చుచున్న
ఈ వికృత పాపరూప ఝంఝాప్రవాహా
మాపుజేయనిచో విశ్వమాగదింక
లెండు సుప్రభాతంబిదె లెండులెండు.

తూరుపుదిక్కునన్ విజయదుందుభి మ్రోగె, వియత్పథంబు రం
గారు మెరుంగు స్వర్ణమయకాంతులతో తళుక్కొత్తె ప్రాక్ప్రభా
తారుణ రక్తకాంతి త్రిదశావృతమై కనిపించె, లెండు మీ
జారిన గుండెలొత్తుకొని సాగుడు ప్రాచ్యదిశాముఖంబుగన్

చిల్లులుపోవసాగినవి చిక్కని చీకటికాంతకండ్లు ది
వ్యోజ్జ్వలసిత ప్రభానవనవోదయకాంతి భరించలేక, న
ల్లల్లనసాగినవి యాకలిచే తపియించు డొక్కలున్
ఎల్లరకు లెండు మీరు పయనించెడిబాటల చక్కదిద్దుకోన్,

ప్రభాతగానం

ఓ నిరుపేదలార! విజయోదయమానసులౌచు సాగి రం
డో నిరుపాధిజీవితములూడ్చెడి యీ ధనరాజ్యసీమలన్
ఈ నరకప్రవాసముల నీ సరిహద్దులదాటి స్వేచ్ఛ, ప్రా
గ్భానుసమానులై దిశల ప్రాకగ రండిక రండు వేగమే.

ఈ గంభీర ఘనాంధకార నటనావిన్యాసముల్ ఘోరమై
సాగెన్ పేదలగుండెపైన ఇటులచ్ఛంబైన చీకట్లలో,
వేగింపంజను యింతకాలమిక, యుర్వీచక్రమున్ ముంచగా
వాగుల్ వారె ప్రభాతకాంతి, మిము నాహ్వానించెరా రండికన్.

కరడుగట్టిన యాశతో పరితపించి
తీరుఁబట్టి కోరికల యెడారిలోన,
ఎండి, మండి డసిగుండెతో నుండ నేల?
రండు రండోయి విజయయాత్రార్థమరుగ.

ఎవరో కొందరు మంచివారలవుచో నేమౌనురా? నేడు భూ
ర్భువ స్స్వర్లోకములందుకూడ నటనంబున్ జేయుచున్నట్టి మా
నవ మాంసాశన రాక్షసప్రకృతి దున్మాడింపగా జేయ, నా
యెవరో కొందరివల్ల నేమగును మీ రీరీతిగానుండినన్.

మాతృవందనం

త్రేయస్కాన లేని దాస్యాంధకారమున, సు
మారు నూటయేబదియేండ్లు మ్రగ్గినావు
జనని శ్రీభారతీ! దివ్యజాత! మా న
మస్సులివె, జోతలివె యందుమమ్మ కరుణ.

చూచితిమి నాడు నీ రోష శోకములను
నీ కపోలాశ్రుబిందువుల్ నేల జాలు
వారి, ప్రవహించిముంచె నీ వసుధనెల్ల
పగిలె హృదయాలు నీ ముద్దుపాపలకును.

శిథిల శిలావతారముల జీర్ణహృదంతరమందునిల్చి, సం
పదలను గోలుపోయి, వసివాడిన నీ ముఖపద్మరేఖలో
ప్రథితయశుండు గాంధిముని పావనతేజముసృష్టిజేసె, మా
హృదయసరోవరాల వికసించెను తామరపూవులప్పుడే.

శిథి శిలలకు మరలను జీవమబ్బె
జీర్ణహృదయాలు తిరిగి క్రొంజివురులెత్తె
ఘన స్వతంత్రేచ్ఛ పోరాడు కర్మవీర
యువకసింహాలగర్జనల్ భువిపగిల్చె.

మాతృవందనం

ఘనశీతాచల, వింధ్యభూధర, మహోగ్రగారావళీపంక్తి, మే
రు నగోత్తుంగశిఖాగ్రమందు జయభేరుల్‌గట్టి. మ్రోగించి, వె
చ్చని క్రొన్నెత్తురు పారజేసియు స్వరాజ్యప్రాప్తిగల్పించి న
ట్టి నరుల్ పుత్రులుగారె నీకు భరతోర్వీ! మాకు అన్నల్‌గదే.

ఎన్నో జన్మల మేమొనర్చిన తపఃఫలం బెంతవో కాని, మా
యన్నల్ సత్యవచఃక్రియాత్ములయి నీ యాకాంక్షలన్ దీర్చి, ని
క్కన్నో రీతుల సాటిదేశముల మేటిన్ జేయనూహించి, తా
మున్నారమ్మ! త్వదీయదీవనలనిమ్మో తల్లి! మా భారతీ!.

సర్వతంత్ర స్వతంత్రరాజ్యాధికార
దీర్ఘ పుష్పమాలిక నీదు దివ్యగళము
నందు నిలిపిరి నీదు పుణ్యంపుసుతులు
నేటితో నీవు సంపూర్ణ నిశ్చల స్వ
తంత్ర వ్యవహర్త్రివిక నేమి తక్కువమ్మ!
చేసెదరు నీకు మూర్ధాభిషేకమిప్పుడె

ఇది యీనాటికిగల్గినట్టిఫలమిట్లెన్నో యుగాంతాలు నీ
విదితంబైన యశస్సునిల్పును... చిరావిఖ్యాతమై చాల దొ
డ్డదియౌ నీమతంబు విశ్వదిశలన్ ఢంకాబజాయించు, నీ
కెదురే లేదుజగాన, ముందుకు స్వతంత్రేచ్ఛన్ ప్రయాణింపుమా!

జీవితాదర్శము

ఆరదు నా కవిత్వవు మహాగ్ని పరాభవమౌనుదాక, చ
ల్లారవు వేడి భావనలు రాక్షసులన్ సమయించుదాక, నా
వారలు దుఃఖపీడితుల బాధనశించెడియంతదాక, నా
స్వైరవిహారమాగదు ప్రజన్ సుఖముల్ వరియించు
దాకనున్

తీరని కోరికల్ హృదయతీవ్రత బెన్పగ జేయు, తీర్చుకో
దారులు లేక, గొప్పధనదార్ఢ్యత లేక, యెదన్ గృశించి, చ
ల్లారని వేదనాగ్నిశిఖలందున మాడు దరిద్ర మానవా
కారులు, నాదుసోదరులకై కవితన్ బ్రచురింపజేసెదన్.

ఏనొక మహాదరిద్ర రాజేశ్వరుడను
నాకవిత్వము దీన జనాళికొరకె
జోగి జోగి రాచుకొనంగ జోలెనుండి
రాలునో బూది లేక, కాలానలశిఖ
లుద్భవించునో యొరపిడి యుందుకతన,
ఎంచి యీశక్తి నిక పరీక్షించుకొనెద.

ఎవరే లేదిక నాకలానికిక ఏ కేమున్నను గూడ నా
యెదలోనుండు మహాగ్ని జ్వాలలకు చన్నీరే కవిత్వంబికన్
పదునెక్కింతు పవిత్రలేఖినికి దర్పంబొప్ప లంఘించి, కా
ల్చెద దౌర్భాగ్య ప్రపంచగోళమును దోర్లీలా ప్రభావో
న్నతిన్.

వట్టి డాబులు గావివి, గట్టి ప్రతిన
యవునిది మదీయ జీవితయంత్రమే శి
థిలముగానిమ్ము, కాని నా దివ్యదీక్ష,
చెదరదేనాటికైనను బెదర నేను.

శ ర ధా ర

నా శరధార పీడితజనాళి కవోష్ణ ప్రగాఢరక్త మా
పోశన జేసి, మత్సరప్రమూల్గులు దిక్కులనింపి, స్వార్థులై
దేశవికాససంపదల తేఱమఱంగిన లోభదేవులన్
నాశమొనర్చి దీనులమనంబు వికాసమొనర్ప జేసెడిన్.

నరసంఘంబులనేతలై నిలచి నానా కృత్యముల్జేసి సుం
దరపూర్వ విశ్వము పాడొనర్పగ ప్రయత్నంబుల్ సదాజేయు ము
ష్కృత దౌర్భాగ్యపిశాచమూర్తుల దురాశాబద్ధులన్ గాల్చు నా
శరధారల్ ప్రళయాగ్నికీలలయి యాశాంతంబు గావించుతన్.

ఘన గాండీవ ఝణంఝణధ్వనుల లోకాలెల్ల కంపింప భీ
ష్ముని తృష్ణన్ వెసదీర్పగా, శరములన్ జొప్పించి పాతాళ గం
గను రప్పించిన పార్థురీతిగ ప్రజాకాంక్షల్ దరిన్ జేర్చ తీ
రని త్యాగంబొనరింప నాదు శరధారన్ సంప్రయోగించెదన్.

ఏదో జిత్తుల మాయనాటకములెన్నెన్నో ప్రయోగించి, నా
త్మాదర్శంబిదియంచు జెప్పి, ప్రజలన్ నమ్మించి, పీఠాలు సం
పాదించంగనుజూచుచున్న పదవీవ్యామోహులౌ ధూర్తులన్
బాధించున్ శరధారశూలసమమై, ప్రచ్ఛన్నమై, మృత్యువై,

నీచులై రాక్షసత్వమునిండుకొన్న
మనసుతో మానవత్వముమరచి వట్టి
కర్మశూన్యుల, ద్రోహుల కఠినహృదయ
భేదనమొనర్చు శరధార పిడుగువోలె.

ఇట గాఢాంధముతప్ప వెన్నెలలు లేనే లేవు, దట్టంపు చీ
కటి పర్దాల్ మిము గప్పి వేసినవి ప్రాకారంబుగా దాటరా
నటులఁన్, జ్యోత్స్నలు లేని మీ బ్రితుకులన్యాయాలు, నిస్సార
ముల్,
ఇటు తెన్నాళ్ళుగనుంటిరో తెలియదెన్నేండ్లో యుగాలో కదా ?.

భగ్నములైన ఈ బ్రతుకుబాటలె రాజపథాలుమీకు, ఈ
నగ్న పిశాచనాట్యములె నాటకముల్, ప్రతిరాత్రియున్ మహో
ద్విగ్న మనస్కులై పరితపించుచునుందురిదేమి? ఏనిలో
మగ్నులరై, విషప్రళయమారుతమందున దూలిపోదురా ...?

ఇదియొక స్వాప్నిక క్షణికవిశ్వము, దీనినియావరించి యు
న్నదియొక మాయచీకటి అనాదిగతంబయి, యీ తెరల్ ?బదా
బదలుగ జేసి, నూతనప్రభల్ తిలకింపగ జేతురండు, రం
డిదె యవకాశమింక లభియించదురా! మరియొక్క నాటికిన్.

ఈ చీకట్లనుచీల్చి, నా వెనుకరండీ! స్నిగ్ధ దివ్యప్రభా
వీచీ శ్రేణుల దేలియాడగ, మహోత్కృష్టప్రదేశంబు కా
లోచింపన్ పనిలేదు మీకును, విలోకింపన్ గగుర్పాటు ఈ
ప్రాచీనద్రిసహీన ధ్వాంతయుత వ్యగ్రారణ్యభాగంబులన్.

అక్షయమైన ఏ బ్రతుకులంచుతలంచెదరొక్కమారు సా
పేక్షగనన్ను గాంచుడు విభీతములై పరుగెత్తు చీకటుల్,
ఈ క్షణమందె రాదలచిరేని రయంబున రండు! రండు! నా
దక్షిణరాజ్యసీమను ప్రధానవిచిత్రవిలాస భూమికిన్.

ఆ మలయాద్రీంద్రశిఖరావృత హైమసమీరబాలికా
హేమకరాలస్పర్శ పులకింపగజేయును మిమ్ము, ఒక్క మా
రామధురానుభూత వివశాత్మతనందినయంతనే నిజం
బేమొ యెఱుంగజాలు మరికిప్పటికైన గ్రహించుకొంటిరా...?

నావిధి మిమ్ములన్ వెలుగుబాటను నిల్పి, అనంతమౌ మహా
శ్రీవిభవంబులన్, బహువిచిత్రదశల్ వెలుగొందు కాలపున్
త్రోవలు జూపుచే - మనసుపోపనివారలు కోరుకొన్నచో
ఈ విరతిప్రదేశమునకే మరలింతును రెప్పపాటులో.

యిదితగ మిమ్ముగోరుటది ఎంతటికో తెలియంగలేరె?
రవ్వంతసుఖంబు లేక భ్రమపాలయి యుండిన మిమ్ముజూచి నా
స్వాంతము తల్లడిల్లును, ప్రశాంతత పీడితోపింపు, భీకర
ధ్వాంతములోన మిమ్ముగనధర్మము కాదు మదీయసేవకున్...

మరణశయ్యమీదనున్న నిరుపేద కళాకారుని హృదయ కవాటాన్ని తట్టి, ప్రేమగా, లాలిస్తూ, ఒక మహాతేజోమూర్తి వినిపించిన పలుకులు ఇవి!

మహా స్మృతి

సహజ సుందరమైన యీ గహనసీమ
విరియబూచిన మోదుగవృక్ష మొకటి
విరిగి నేలనబడిపోవ పరితపించి
కోటి రసహృదయాలు గగ్గోలు జెంద
నా తెలంగాణగుండెలో కోతగలిగె॥

కల్లనైనన్ సుఖశాంతి సంపదలెరుంగన్ లోక దౌర్భాగ్య రా
జులపాలిన్ బడి నెత్తురోడ్చి గళితాత్మస్వాత్మలా కోటి త
మ్ముల నిట్టూర్పుప్రళయంబు విప్లవము మార్మోగించి చేకొట్టి యీ
తెలగాణంబును పైకి నెత్తిన సుబుద్ధీ నీకుజోహార్లురా!!

శరధార

మిథ్యాకల్పిత నైతికాచరణలున్ మృత్పిండరూపుల్ ధనా
రాధ్యుల్ దుర్వ్యసనప్రవర్తనుల తంత్రాల్ నిష్ఫలంగా నింపగా
ఆద్యంతంబు మనోవ్యథల్ పెనగొనన్ అర్థాంతరంబుం గనే
యధ్యాయంబు ముగించినావుగద అన్నా! నీ చరిత్రంబులో॥

ప్రారంభోత్సవదివ్యకాలమిది ఆంధ్ర ప్రభవస్ఫూర్తికిన్
ప్రారంభించిన హోమకుండము మహాంధ్రంబున్ గనంబోక, చ
ల్లారంజాలదు ఈముహూర్తము సహాలక్షగ్రంథపుటల్ గనగా
జేజల్ వోయిన మాగళాలు నినదించెన్ నీ మహాకీర్తికై

కేశవరాయా! ఇది నీ
కోసం పాడిన గీతం
కలపట్టి తెలంగాణ
కన్నీళ్ళకు రూపునిచ్చి
గళాన్నెత్తి తెలంగాణ
పొలమంతా తిరిగి తిరిగి
నీకోసం పాడామిది
నీకిదిగో భక్త్యాంజలి॥

తిరిగిరాని సర్దార్

ఓయి పథికుడా! ఇలువీడియొంటిగ పయ
నించెదెటకయ్యా...? నింగియందేమిగలదు?
పరిజ్వలితుడగుచుండెను భాస్కరుండు
అలసిపోయెదవడుగిడవలదు ముందు.

"ఆగుము...దూరభారపు ప్రయాణము జేయుచునుంటి వింటిలో
నేగలభాజనించె ఇది నేరనియట్లునటించి ఏదో వ
న్నాగముబూని, పిలుపునయినన్ విననంతటిదూర మప్పుడే
సాగితివేమి? ఇంచుకపరిశ్రాంతమనస్కుడవౌచు నిల్వుమా!

తిరిగిరాని సర్దార్

"జీవితమెల్ల కాలమును సేవకు నర్పణ జేసి, మా ప్రజా
భావములందు ఎన్నడెడబాయని నీడగ నిల్చి, నేతవై
నావు, గురుండవై మెలగినావు, నయాన, భయాన అందరన్
త్రోవకు దెచ్చి, నేడు విడద్రొక్కితివా సరదారువాటచే.

"ఇదిగో! నీదు వియోగబాధవలనన్ వెర్రెత్తి, సంక్షోభ దుః
ఖ దవాగ్నిన్ బడి మాడుచున్నది ప్రజాగంభీరలోకంబు, అ
ల్లదిగో! చేసెడి కార్యముల్ మరచి నీరైపోయె కాళ్ళాడకన్
వ్యథలన్ కుళ్ళెడి తోటి సేవక సమూహం బెట్లు గూర్చుండెనో.

"మాయని గాయమై యిలచె మా హృదయాలపయిన్ మహాత్ముడ
న్యాయము జేసిపోవుటయు, నారమణర్షియునట్లె, మొన్ననే
మా యరవిందయోగి అదెమాదిరి మాయమయెన్, ఇదేమి య
న్యాయము...? నీవు కూడ పయనంబొనరించుచునుంటి వింతలో

అవునా? దేశము వీడిపోవుటకిదయ్యా వేళ? ఈ యిల్లు నీ
దవుశాకాద? మహామరాత్ములు, సుఖవ్యాపారులౌ వారలిం
కవలీలన్ చెలరేగి ఈ గృహములో కల్లోలముల్ రేపరా
అవురా! ఎంత యరిష్టమబ్బెగదనయ్యా! నీ ప్రయాణంబుచే.

"ఎన్ని యుగాలకైన ప్రభవించడు నీ సముద్రైన నేత- ఇం
కెన్ని యుగాలకైన విజిగీష నశించదు మాకు దేశమె
న్నెన్నో విధాల నిన్ను గుర్తించినగాథలు బాధలౌచు, మా
కన్ని విధాల దుఃఖములనాపక గూర్చుచు జీవితాంతమున్.

"ఇప్పటికైన మా పిలుపు నింత చెవిన్ బడనిమ్ము, మేమొకున్
చెప్పెడిదింక లేదు, మరి చేసెడిదేమియు లేదు కాని, నీ
వెప్పటికైన ఏదిశకు నేగిననైనను, భారతీయులన్
తప్పక ఒక్కకంట విదితాత్ముడవై కని పెట్టియుండుమా!

కడుపులో వేదనాగ్ని యంగాంగముల ద
హించుచున్నది, ఎంతరోదించిన సరె
రావు నీవిక అశ్రుధారా స్రవంతి
యందు మునుగుటె కర్తవ్యమాను మాకు

నీపవిత్రాంతరాత్మకు నేటినుండి
పూర్ణశాంతిలభించుత. భూమియందు
నీవొనర్చినకార్యముల్ నిఖిల మాన
వాళి కాదర్శప్రాయమైవరలు, ఇంక
నిల్తుమిచ్చటె, నిన్ను ధ్యానించుకొనుచు!

ఆ లో చ న ......

.........(ఆ వే ద న)

నీప్రపంచవిశిష్టత నీకెముదము
గూర్చుగాని, దుఃఖాంబుధిన్ గ్రుంకు, వారు
రంత జీవితములకును సంతసంబు
గూర్పజాలదు ఓ దొడ్డనేర్పు కాడ!

నీవేసృష్టియొనర్చినావు జగమున్, నీపేరనే రోజు కె
న్నో వేలాది యకృత్యముల్ జరిపినన్ నోరెత్త నేలేవు, దే
వా! వారింపగలేవు సంఘమున నీభక్తాగ్రగణ్యుల్ చేయు, దు
ర్భావోద్రేకమహా నికృష్టయుత దౌర్భాగ్యంపుదుశ్చర్యలన్

ఎందుకు మమ్ము సృష్టియొనరించితివో తెలియంగరాదు, గ
ర్వాంధుల మోటుపాదములరాపిడికిన్ బలిజేయనా? మహా
నందపథంబునన్ బ్రతుకునాళ్ళుముగింపగనా? రవంత, యీ
సందియమున్ పరిష్కరణసల్పుము దైవమా! నీకుమ్రొక్కెదన్.

పాపంబన్న పదంబునే వినని మా పాపల్ క్షుధాపీడితుల్
రేపున్ మాపును జోలెచంకనిడి, "తండ్రీ భిక్షమో" యంచు ఎ
న్నే పాట్లన్ బడుచున్న జూచెదరుగానీ, ప్రేమనోరార, "రా
రా! పాపా!" యనిపిల్చి భిక్షమిడు ధర్మాత్ముండు లేడో ప్రభూ!

కళకళలాడు చెక్కిళుల కాంతి ముఖంబున వెల్గునింప, ది
వ్య లలితముగ్ధభావనల వచ్చియు తానిపయస్సుతో, మన
స్సుల గిలిగించివేయు నవసుందరి నేలను సృష్టిజేసి తో
మలమల కూడుగుడ్డలకు మాడ్చి తపింపగజేయనా ప్రభూ!

శోభ నశించి, పూచిన యశోలతికల్ మొదలంట నెండి, ఎ
న్నో భయదంబులౌ శ్రమలనోర్చి, కృశించి, నిరాశజెంది సం
క్షోభమహాగ్ని దగ్ధులగుచున్న జనంబుల గావలేని, నీ
వా భువనైకరక్షకుడవు...? వాకొన సిగ్గనిపించు దైవమా!

ఎక్కడి శోక నిస్స్వనమిదే దెశనుండి వినంగవచ్చె, నే
బక్కపకీరు గుండెలను బ్రద్దలు చేసిరొ, దుర్మదాంధులే
దిక్కున చూడలేకను గతించిన పేదసుతున్ గురించి, ఏ
చక్కనితల్లి రోదనము సల్పెడినో వినుచుంటివా ప్రభూ;

కరుణానందమయా! మదీయసుఖస్వర్గారామమున్ మాన్పి, సుం
దర రత్నస్థగితంబునై; తళతళత్కాంతుల్ ప్రసారించు, చి
త్రసువర్ణల్ గల్గిన సింహపీఠమును పాతాళంబునన్ ద్రోసి, గం
దరగోళంబావరించి నా బ్రతుకులో దావాగ్నులన్ రేపితే...?

ఇదినీవిస్తృత విశ్వగోళచరితం బెన్నాళ్ళు మూంచి త్తనుల్
వ్యధతో నిప్పుల కృంగజేసెదవు ? దేవా! వ్యష్టుల జీవనా!
మదమాత్సర్య ప్రచండవహ్నిబడి దౌర్భాగ్యంబుగా జచ్చెడు
నుమనుజుల్ ప్రాయూటజెల్లునా? ఇవియుమున్నా రేంక్షుకుల్
దప్పదా?

ఈ లోకంబున సత్యవర్తనను ధర్మేచ్ఛల్ గనజాలోము, ఘోరా
రాలా చెప్పగలేము, దీనజనులన్ రాపాడి, హింసించు, శా
ర్దూలావాస భయంకరాటవిగ, నిర్మానుష్యంబునైపోయె ఇం
కేలా నీప్రళయోగ్రతాండవము సాగించంగ రావో ప్రభూ!

నీయశస్సు శాశ్వతముగా నిఖిలవిశ్వ
గోళమందున చిత్రించగోరి తేప
క్రీతము నీపేరుమీద సాగించినట్టి
ఈ సురవ్యాసు సాంఘిక హింసలకును
బాధ్యత వహించి, పేదల బ్రతుకులకును యి
నమృతధారలు చల్లి చల్లార్పుమగ్ని.

ఎవరికి తెలుసు.....?

వెలుతురును మింగి మిక్కిలి బలిసిపోయి
రాత్రి, తమసము, తనకు దానె సృజించు
కొన్ని తెఱలను ఛేదించి, కన్ను దెఱచి,
వెలుగుబాటను నడచిన వీరుడెవడో ?

భయద మృత్యుప్రభంజనార్భటిని క్రియా
శక్తిగా భ్రమియించి, దిశాంత వ్యాప్తి
మైన సామ్రాజ్యస్థాపనకై ప్రయత్న
ములనొనర్చెడి, మూఢుల మూర్ఖ్యమెంతో...?

రత్నమకుటధారులు మహారాజనములు;
బ్రతుకు నేలకంటగ ద్రొక్కబడిననరులు.
ఒకప్రదేశాన సములయి యుండుటకును
రావలసియున్న ఘోరప్రళయమదెంతో...?

అందరికిఅందరాని ఆనందమయ సు
ధామధుర జీవితానుభోక్త్రత లభించు
నాశలో, చిచ్చురేపుకొన్నట్టివ్యక్తి
మానసికమైన వేదనపారమెంతో...?

అతిప్రమాదభూయిష్ఠ జీవితపథాన
నడువలేకొంటిగా, నవనాడులు కృశి
యింప, ఈమార్గమును విసర్జించి, శాశ్వ
తుడమైపోను, అవసరమైనఘడిముతెన్నొ...?

త్యాగమొనరించి, ప్రాణాలుధారవోసి
నిలుపుకొన్నసంపద వారి నెత్తిగొట్టి
దోచుకొని, దేశదేశాలలోచరించి
పెంచుకొన్న ప్రతిష్ఠకు విలువయెంతో...?

ఏ మ ని వ్రా యు దు న్....?

ఏమనివ్రాయుదున్? హృదయమేఇసుమంతయు లేని క్రూర దీ
క్షా మదమత్తులైన లయకారులహస్త శతఘ్నికిన్, స్వసేవా
మహితాత్ములౌ తెలుగువారల గుండెల నప్పజెప్పు చు
న్నామని వ్రాయనా...? పయిని, నాకలమెట్లుల సాగు సోదరీ

ఎక్కడిపాడులోకమిది. యేమి మహాప్రళయాగ్ని, దీని కిం
కెక్కడ తావులేద? రమణీయమనోజ్ఞ కళామతల్లి! నీ
దృక్కులుమాసిపోవగ సతీమణులార్చగ మారణాగ్ని, పెం
పెక్కిన రాక్షసేచ్ఛతో దహించెను సోదరి ! నీశరీరమున్.

ఇది సెయుజ్వాల దేశసేవఫలమా ? ఎన్నో శతాబ్దాల సం
గ్రథితానూన తెలుంగు నాగరికత ప్రాశస్త్యమా? లేక, దు
ర్మదపైశాచిక, వికృతంపు నటనంబా? ఏదియో? చిత్రహా
వధకున్ పాలయితీవు, దేశ చరితల్ వర్ణించు నీగాథలన్.